పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తం

- 21 పంచాయతీలకు 14 మంది కార్యదర్శులు
- పనిభారంతో సతమతం అవుతున్న ఉద్యోగులు



మల్లాయపాలెం-2 పంచాయతీ కార్యాలయం

గుడివాడరూరల్: గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. మండలంలో 21 పంచాయతీలకు 14 మంది మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. ఆ కార్యదర్శుల్లో కొందరిని ఖాళీగా ఉన్న పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియమించారు. దీంతో వారిపై అదనపు భారం పడింది. ఒక్క కార్యదర్శి రెండు గ్రామాల బాధ్యతలను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఫలితంగా రెండు గ్రామాల్లో పూర్తి స్థాయిలో కార్యదర్శి అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

చాలా పంచాయతీల్లో సిబ్బంది పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఉన్న సిబ్బందిపై పనిభారం పడటంతో ఎక్కడి పనులు అక్కడే ఉండిపోయి మొండికేస్తున్నాయి. కొన్ని చోట్ల కనీసం ఫైల్ అందించేందుకు అటెండరు పోస్టులను కూడా భర్తీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. 21 పంచాయతీల్లో ఐదు గ్రేడ్-1 పంచాయతీలు. ఈ పంచాయతీలకు బిల్ కలెక్టర్ ఒకరు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు చొప్పున ఉండాలి. దొండపాడు, మల్లాయపాలెం, మోటూరు పంచాయతీలకు మాత్రమే బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్‌లు ఉన్నారు. బొమ్ములూరు, చౌటపల్లిలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన పంచాయతీల్లో సైతం ఈ పోస్టులు అరకొరగానే ఉన్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి పన్నుల వసూలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు కార్యదర్శులు హాజరై పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు.

ఖాళీలు భర్తీ చేయక ఇబ్బందులు

పంచాయతీ కార్యదర్శుల ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని పంచాయతీల్లో రామనపూడి, లింగవరం, సీపూడి గ్రామాలకు చిరిచింతల గ్రామ పంచాయతీ కార్యదర్శి, చౌటపల్లి, నూజేళ్ల పంచాయతీలకు బిళ్లపాడు కార్యదర్శి, సైదేపూడికి దొండపాడు కార్యదర్శి, సిద్ధాంతం, శేరీగొల్వేపల్లి పంచాయతీలకు శేరీదింటకుర్రు పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కల్వపూడి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండటంతో ఆ పంచాయతీలోని గ్రేడ్-5 సెక్రటరీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. పంచాయతీలకు నిత్యం కార్యదర్శులు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామాల్లో సమస్యలతో పాటు అభివృద్ధి కూడా కుంటుపడుతోందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యదర్శులపై పనిభారం



మండలంలోని 21 పంచాయతీల్లో కేవలం 14 మంది కార్యదర్శులే ఉన్నారు. దీంతో వారికి పని భారం ఎక్కువై సతమతం అమవుతున్నారు. అన్ని గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులను నియమించి గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

–మేకల సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్

పోస్టుల భర్తీకి చర్యలు

మండలంలోని పంచాయతీల కార్యదర్శుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఆయా పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్యదర్శులను నియమించేందుకు కమిటీని వేశారు. త్వరలోనే ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చర్యలు చేపడతాం.

– బి.వై.విష్ణుప్రసాద్, ఎంపీడీఓ, గుడివాడ మండలం

క్లుప్తంగా

31వ తేదీ లోగా గోకులాలను పూర్తి చేయాలి



పామర్రు: క్లస్టర్ పరిధిలో మంజూరైనా గోకులాల నిర్మాణ పనులను ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వి.శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్లస్టర్‌లోని పామర్రు, పమిడిముక్కల, మొవ్వ, పెదపారుపూడి మండలాలకు చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎఫ్‌ఏ, సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. పీడీ శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. గోకులాలను సర్వాంగ సుందరంగా పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ఉపాధి కూలీలు అందరికీ పనుల ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి నాంచారరావు, పామర్రు ఏపీఓ సురేష్, మిగిలిన మండలాలకు చెందిన ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రత్యూషకు డాక్టరేట్



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ సునీల్ ప్రత్యూష డాక్టరేట్ పట్టా పొందినట్లు ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ గురువారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో డాక్టర్ కె.సాంబశివరావు పర్యవేక్షణలో 'శ్రీ వేలూరి శివ రామశాస్త్రి కథలు – నాటికల పరిశీలన' అంశంపై ప్రత్యూష చేసిన పరిశోధనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ ప్రదానం చేశారని వివరించారు. ప్రత్యూషను కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, అధ్యాపకులు అభినందించారు.

పైప్‌లైన్ లీకు.. తాగునీరు వృథా



మండవల్లి: మండవల్లి మెయిన్ సెంటర్ ఎదురుగా ఉన్న రోడ్డులో నాలుగు అంగుళాల తాగునీటి పైప్‌లైన్ జాయింట్ లీకై రెండు నెలల నుంచి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అరికట్టాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో వారి అలసత్వం కనిపిస్తోందన్నారు. స్టేషన్ రోడ్డుకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు జాయింట్ వద్ద లీకేజీ ఏర్పడి పెద్ద ఎత్తున నీరు పోతుందని స్టేషన్‌రోడ్డు, బీసీ కాలనీకి నీరు అందడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సజ్జలను కలిసిన జాన్‌బెన్ని



గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ మాజీ ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్ని గురువారం కలిశారు. సజ్జలను మర్యాద పూర్వకంగా తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిశామని బెన్ని చెప్పారు. భవిష్యత్తులో పార్టీ పరంగా నిర్వహించవలసిన కార్యక్రమాలపై తనను సజ్జల ఆదేశించారని పేర్కొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి



కైకలూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో నిరంతరం కృషి చేస్తానని పార్టీ ఏలూరు జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల వెంకట నాగేశ్వరరావు (నాగు) పేర్కొన్నారు. తన నియామకానికి సిఫార్సు చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను కై కలూరు పార్టీ కార్యాలయం వద్ద గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాగు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా చూడడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మద్దం రంగబాబు, మద్దం రామకృష్ణ, అయినాల సత్యనారాయణ, ఇమ్మానేని రాము, అంకాల ప్రసాద్, పోకల శ్రీను, దుగ్గిరాల రమేష్, బేబీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ


కంప్యూటర్లు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

గుడివాడ టౌన్: విద్యాభివృద్ధికి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి డి.బాలాజీ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నంబర్-1, ఓల్డ్ టౌన్ నంబర్-2 ప్రైమరీ పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంక్ రెండు కంప్యూటర్‌లు, ప్రింటర్లను అందజేసింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బ్యాంక్ సామాజిక సేవా బాధ్యతలో భాగంగా కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. బ్యాంక్ అధికారులకు విద్యాశాఖ తరుపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఏజీఎం వెలిశె నందన్, బ్యాంక్ మేనేజర్ ఆది శేషుకుమార్, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగారావు, నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడంకి హైస్కూల్‌కు ఐడీబీఐ బ్యాంక్ విరాళం


ఫర్నిచర్, కంప్యూటర్ అందజేస్తున్న ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్

పమిడిముక్కల: తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఉయ్యూరు ఐడీబీఐ బ్రాంచ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.65 వేల విలువైన ఫర్నిచర్, కంప్యూటర్ అందజేశారు. హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్‌కు ఫర్నిచర్, కంప్యూటర్‌ను బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జాదు కిరణ్‌కుమార్ అందజేశారు. ఐరన్ బీరువా, ఐరన్ రాక్స్, చైర్స్, కంప్యూటర్ అందజేసిన ఐడీబీఐ బ్యాంక్‌కు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, హైస్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులి శ్రీనివాసరావు, బ్యాంక్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నేషనల్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పట్టణ వీధుల్లో కళాశాల విద్యార్థులతో కలసి డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులు ప్రజలను కోరారు. డీఎస్పీ ధీరజ్ వినీల్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా మన జీవితాలనే కాకుండా ఎదుటివారి జీవితాలను రక్షించినవారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, ఎస్ఐ గౌతమ్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్‌ప్రిన్సిపాల్ ఆలీయాబేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీవన్, సిబ్బంది కె.శ్రీనివాసరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్నికల హామీ నిలుపుకోవాలి


ప్రసంగిస్తున్న కమిటీ కార్యదర్శి అరుణ

గుడివాడ టౌన్: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన ఎన్నికల హామీ అయిన టిడ్కో గృహాల రుణం మాఫీని నెరవేరాచలని టిడ్కో గృహాల లబ్ధిదారులు డిమాండ్ చేశారు. స్థానిక సీ బ్లాక్ వద్ద టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే ఇళ్ల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థిగా వెనిగండ్ల రాము హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల అనంతరం ఆ ఊసే ఎత్తకపోగా బ్యాంకుల వారు వత్తిడి చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ హామీ అమలు కోసం కొన్ని నెలలుగా తాము పోరాటం చేస్తున్నామని, లబ్ధిదారులందరూ ఏకమై ఈ సమావేశానికి హాజరుకావడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం హామీని నిలుపుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు సయ్యద్ నూరున్నీసా, బాధ్యులు శివరామ్ ప్రసాద్, ఎస్.రాంబాబు, ఆర్.గణేష్, రంగమ్మ, వీరాస్వామి, పద్మ, నజ్మ, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడివాడటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని టౌన్ హైస్కూల్‌లో తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కంటి వైద్యులు డాక్టర్ పి.అజయ్, డాక్టర్ ఎల్.శోభారాణి ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నాలుగు రోజుల్లో విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోనా రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాస్, కోశాధికారి చింతా రామకృష్ణ, పూర్వ అధ్యక్షులు, మాజీ గవర్నర్‌లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళులు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు స్థానిక మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి సంస్థ చైర్మన్ గోపాలరావు, ప్రెసిడెంట్ గోపిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, లక్ష్మయ్య, రుద్రమ్మ, రమణమ్మ, లక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దూడల అందాల పోటీలు


పోటీల్లో పాల్గొన్న దూడలు

చినముత్తేవి(మొవ్వ): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మొవ్వ మండలం చినముత్తేవి పాలకేంద్రం సమీపంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం, దూడలకు అందాల పోటీలు నిర్వహించారు. ఈ శిబిరంలో 56 పశువులకు గర్భకోశ వ్యాధులు, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 150 గొర్రెలు, మేకలకు పేల నివారణ మందు ద్రావణాన్ని పిచికారీ చేసి వ్యాధి నిరోధక ఇంజక్షన్లను చేశారు. అనంతరం నిర్వహించిన దూడల అందాల పోటీల్లో 35 దూడలు పాల్గొన్నాయి. నిబంధనలు అనుసరించి వరసగా మొదటి మూడు బహుమతులను మోటుపల్లి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ హనుమకుమార్, పామర్తి గోపాల్ దూడలకు అందజేశారు. పందేల్లో పాల్గొన్న దూడల రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము సౌదామని, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ నాగబోయిన చిన్న నరసింహులు, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ దివాకర్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి.సృజన కుమార్, జేవీఓ వెంకటయ్య, పాల సొసైటీ అధ్యక్షుడు చందన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక అధికారులు దూడల పెంపకం, పాడి పశువుల పోషణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రారంభమైన గ్రిగ్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్: క్రీడలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని మండల విద్యాశాఖాధికారి ఐ.విజయ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గ్రిగ్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి విజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విశ్రాంత ఎన్‌డీఎస్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. గురువారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్ పోటీలను నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: ఇటీవల గుడివాడ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.ధీరజ్ వినీల్ గురువారం మచిలీపట్నంలో కలెక్టర్ డి.కె.బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని కలెక్టర్ అభినందించి శాంతిభద్రతలను గుడివాడ డివిజన్ పరిధిలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

గుడివాడటౌన్: సైబర్ నేరగాళ్లు ఏ విధంగానైనా మోసం చేస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ బి.ముకుంద్ రాజ్ సూచించారు. స్థానిక జి.వి.పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ముకుంద్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ మోసాలను ఎదుర్కోవడం రోజువారీ కార్యక్రమాల్లో భాగమైందన్నారు. స్మార్ట్ ఫోన్లను వినియోగంపై ప్రతి ఒక్కరూ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్. రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, కోశాధికారి ఎన్.ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు రావి శ్రీహర్ష, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు ఎస్‌ఐగా అవినాష్

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎస్‌ఐగా అవినాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ అర్జునరాజును జిల్లా అధికారులు ఆకస్మికంగా వీఆర్‌కు పంపిన విషయం విదితమే. ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన అవినాశ్‌కు స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

గుడ్లవల్లేరు పీహెచ్‌సీ తనిఖీ

గుడ్లవల్లేరు: స్థానిక పీహెచ్‌సీని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. హాస్పిటల్‌ను పరిశీలించిన ఆయన పీహెచ్‌సీకి వచ్చే పేషెంట్లతో పాటు మందుల వాడకంపై వైద్యాధికారి డాక్టర్ యశస్వినీని ఆరా తీశారు. ఈ పర్యటనలో మాజీ సర్పంచి చాపరాల బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రదేశాల గుర్తింపు

కైకలూరు: రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీసులు గుర్తించారు. సీఐ వి.రవికుమార్ ఆదేశాలతో ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో బ్లాక్ స్పాట్లను గురువారం నమోదు చేశారు. వీటిలో ప్రమాదాలు ఎక్కువగా సంభవించడానికి ఆస్కారం ఉన్న రోడ్లు, జాతీయ రహదారులను అనుసంధానం చేసే రోడ్లు, గుంతల రోడ్లు, ప్రమాదకరమైన మలుపులు, పాఠశాలల సమీప రోడ్లు ఇలా పలు అంశాలపై జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులకు నివేదిక పంపించామని సీఐ చెప్పారు. భుజబలపట్నం ఉన్నత పాఠశాలలో హేమంత్ ఆక్వా నీడ్స్ అండ్ ఫీడ్స్ సహకారంతో ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని రూరల్ ఎస్ఐ వి.రాంబాబు గురువారం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

సైన్స్ నిత్య జీవితంలో భాగం కావాలి

కైకలూరు: నిత్య జీవితంలో సైన్స్ భాగం కావాలని మంగళగిరిలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ సూచించారు. మెటీరియల్ సైన్స్ విభాగంలో పరిశోధనలు అనే అంశంపై కైకలూరు, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నగరం ఎస్వీఆర్ఎం కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో కైకలూరు కాలేజీలో గురువారం అంతర్జాతీయ వెబినార్ ప్రారంభమైంది. కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ దీనిని ప్రారంభించారు. శుక్రవారం వరకు జరిగే వెబినార్‌లో విశాఖపట్నం గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డొల్లా తరుణ్, అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ ప్రొఫెసర్ నరేంద్ర నాయక్ దేశావత్ పరిశోధనలో లెటరేచర్ సర్వే, వ్యవసాయ ఉత్పత్తుల నుంచి బయో ఇథనాల్ గురించి వివరించారు. వెబినార్‌కు కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వై.శ్రీలత అధ్యక్షత వహించారు.

ముదిరాజుల కేటగిరీ మార్చాలి

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తులను బీసీ కేటగిరీకి మార్పు చేయాలని వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణు వర్ధన్ కోరారు. ఈ మేరకు విజయవాడలో బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు ఇప్పటి వరకు బీసీ-డీ కేటగిరిలో ఉన్నారని వీరిని బీసీ-ఏ కేటగిరీకి మార్పు చేయాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. తనతోపాటు వినతిపత్రం అందజేసిన వారిలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కొర్రె నారాయణ, అధ్యక్షురాలు తుంగం ఝాన్సీ, సర్పంచులు బోనం శేషగిరి, పేరే రామకృష్ణ, తుమ్మ రామశాస్త్రి, పరసా శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మినుము సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను అధిక ధరను పొందొచ్చని గౌతమ్‌కుమార్ సూచించారు. మినుము పైరు పూత, పిందె దశలో ఉన్నందున తెగుళ్లు, పురుగులు రాకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రకృతి వ్యవసాయంలో తయారు చేస్తున్న వేప, గోమూత్ర తదితర వాటితో తయారు చేసిన ప్రకృతికి హాని లేని మందులను వాడాలని పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తే సమస్య పరిష్కారం

కైకలూరు: పట్టణంలో జాతీయ, పంచాయతీ రహదారులు, కాల్వ గట్లపై ఆక్రమణలు తొలగిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు నిర్ణయించారు. ఇటీవల రహదారి వెంబడి ఆక్రమణలపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపుపై కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఎంపీడీఓ ఆర్.ఫణీంద్రతో గురువారం సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితిని సీఐ పి.కృష్ణ వారికి వివరించారు. అందరూ ముందుగా కైకలూరులో ఆక్రమణలు తొలగించడానికి మార్కింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరులో పశువులకు గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్యాధికారి ఆరేపల్లి రామకృష్ణ శిబిరంలో పాల్గొని పరీక్షలు చేశారు. పశువులకు నట్టల నివారణ మందులు అందజేయడంతో పాటు సూడు పరీక్షలు, కృత్రిమ గర్భధారణ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు పోషకులకు జీవనాధారంగా మారిన జీవాలకు వ్యాధులు సోకకుండా శిబిరాల్లో ఉచితంగా టీకాలు వేసినట్లు చెప్పారు. దీర్ఘకాలం పాటు ఎదకు రాని పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నందున పశుపోషకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిబిరాలను వినియోగించుకోవాలి

మండవల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను పశుపోషకులు ఉపయోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని పుట్లచెరువు, పెనుమాకలంక గ్రామాల్లో గురువారం పశు వైద్య శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు రకాల టీకాలు వేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. పశువులు వ్యాధుల బారిన పడకుండా పశుపోషకులు వాటికి టీకాలు, మందులు వాడాలని సూచించారు. కానుకొల్లు డాక్టర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మండవల్లి: మండలంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం పెరికెగూడెంలో వీధుల్లోని చెత్తాచెదారాన్ని సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వీధుల్లో చెత్త ఉంటే గ్రామస్తులకు అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కారణంగా ఎక్కడా చెత్త కనిపించకుండా తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక కాకర్ల వీధిలోని ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం ప్రారంభించారు. ఎన్నారై డాక్టర్ గోరంట్ల వాసుబాబు వితరణతో ఈ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేయడానికి ప్రయోగశాలలు అవసరమన్నారు. అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ విద్యార్థులను విజ్ఞానవంతులను చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమీలారాణి, ఎఫిషియన్సీ సొల్యూషన్స్ ఎండీ వెనిగండ్ల ప్రత్యూష, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.